క్లుప్తంగా

ఎమ్మెల్యే పెద్దిరెడ్డిని కలిసిన అంజుమన్ కమిటీ



ఎమ్మెల్యే పెద్దిరెడ్డితో సలీంబాషా తదితరులు

పుంగనూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శుక్రవారం అంజుమన్ కమిటీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ సలీంబాషా, ముస్లిం పెద్దలు న్యామతుల్లాఖాన్, ఖాదర్‌బాషా, తాజ్‌బాషా మాట్లాడుతూ పుంగనూరు పరిణామాలపై చర్చించామన్నారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటామని, ఎవరు అధైర్యపడవద్దని పెద్దిరెడ్డి భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి

గంగవరం: పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని పత్తికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో డ్రై డే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. దోమకాటులో డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రాత్రివేళల్లో దోమతెరలు వాడాలని సూచించారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

పుంగనూరు: పట్టణంలోని విరూపాక్షి మారెమ్మకు శుక్రవారం రాహుకాల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఉసిరి, నిమ్మ, ద్రాక్ష పళ్లతో విశేషంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి మారెమ్మతల్లిని దర్శించుకున్నారు. మహిళలు చలిపిండితో నెయ్యిదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. నిమ్మకాయలు, వేపాకు, గుమ్మడికాయలు పెట్టి దిష్టి నివారణ పూజలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ట్రిపుల్ ఐటీకి ‘ఆదర్శ’ విద్యార్థులు



మదన్‌కుమార్



జానకి

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైయ్యారు. శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎస్ రమ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన మదన్‌కుమార్, డి.జానకి అనే విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో 570 మార్కుల చొప్పున సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వెల్లడించార. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం



కళాశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ (జూనియర్ కళాశాల)ను ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. స్కూల్ కిట్స్ అందజేశారు. డిప్యూటీ డీఈఓ పురుషోత్తం, ఎంఈఓలు గోపాల్ రెడ్డి, తులసీరామ్, ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్, తహసీల్దార్ నాగేంద్ర, హెచ్ఎం కేశవ పిళ్లై, జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప,మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, స్థానిక నేతలు ఆనంద్, శ్రీరాములు, భానుప్రతాప్ రెడ్డి, నాగరాజా, సర్పంచ్ అఖిల, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ



యూనిఫామ్ అందిస్తున్న దాత

పలమనేరు: పట్టణంలోని పురపాలక సంఘంలో పనిచేస్తున్న 128 మంది పారిశుద్ధ్య కార్మికులకు శ్రీనివాస షోరూమ్ అధినేత శుక్రవారం యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అభినందించారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు!



పలమనేరు సమీపంలో మదనపల్లె రోడ్డు పక్కన వ్యవసాయ భూమిలో వెలసిన లేఅవుట్

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేట్రేగిపోతున్నారు. ఇష్టారాజ్యంగా భూ దందాకు తెరతీస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే లేఅవుట్లు వేసేస్తున్నారు. దళారులను పోగేసుకుని ప్రజలకు ప్లాట్లను అంటగడుతున్నారు. మధ్యవర్తుల మాయమాటలకు పడిపోయి పలువురు స్థలాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు సైతం అక్రమార్కుల కనుసన్నల్లోనే నడుస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. మూకుమ్మడి మోసానికి చివరకు ప్లాట్ కొనుగోలు చేసిన వారు బలవుతున్నారు.

- అప్రూవల్ లేకుండానే ప్లాట్ల విక్రయాలు
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు
- కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే రెచ్చిపోతున్న రియల్ వ్యాపారులు
- యథేచ్ఛగా ప్రజలను ఏమారుస్తున్న దళారులు

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో రియల్ దందా మొదలైంది. ముందుగా నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు జట్టుకడుతున్నారు. ఏదో ఓ భూమికి కొంత బయానా చెల్లించి అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆ భూమిని చదునుచేసి రాళ్లు నాటి లేఅవుట్ వేసేస్తున్నారు. ప్లాట్ల స్కెచ్ చేతబట్టి అమ్మకాలు సాగించేస్తున్నారు. ఇలాంటి లేఅవుట్లలో స్థలం కొన్న వారు ఆపై ఇంటి నిర్మాణం చేసేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. మళ్లీ అధికంగా డబ్బులు ఖర్చుచేసి అనుమతులు పొందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది గమనించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లేఅవుట్ల విషయంలో పక్కాగా నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అన్ని అనుమతులున్న లేఅవుట్ సైట్లకు మాత్రమే క్రయవిక్రయాలు జరపాలంటూ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అన్నీ మళ్లీ మొదటికే వచ్చాయి. ముఖ్యంగా పలమనేరు నియోజకవర్గంలో సైట్ల వ్యాపారాలు పాత పద్ధతిలోనే సాగుతున్నాయి. ఫలితంగా అక్రమ లేవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రజలను యథేచ్ఛగా మోసం చేస్తున్నాయి. రియల్ దళారుల మాయమాటలను నమ్మి ప్లాట్ కొనుగోలు చేసిన తర్వాత కానీ, జనాలకు అది అక్రమ లేఅవుట్ అని తెలియడం లేదు.

ఇదిగో సాక్ష్యం

పలమనేరులోని శ్రీనగర్‌కాలనీలో ఇంటి స్థలాల ధరలు ఆకాశాన్నంటాయి. ఇక్కడ అడుగు రూ.2 వేల నుంచి రూ.4వేలకు చేరింది. అయితే కాలనీ లేసిన లేఅవుట్ నిబంధనలకు విరుద్ధంగా ఉంది. ఈ విషయం తెలియని కుమార్ అనే వ్యక్తి దళారుల మాట నమ్మి ఓ సైట్ కొన్నాడు. దీనికి సంబంధించిన పత్రాలను బ్యాంకులో పెట్టి ఇంటి నిర్మాణం కోసం ప్రయత్నించాడు. బ్యాంకు వారు అడిగిన పత్రాలు కోసం వెళితే ఆ లేఅవుట్‌కు ఎలాంటి అనుమతులు లేవు అనే విషయం తెలిసింది. దీంతో మున్సిపాలిటీలో ఖాళీస్థలానికి పన్ను ఆపై అప్రూవల్ తదితరాలకు రూ.50 వేల వరకు కుమార్ చెల్లించాల్సి వచ్చింది. దీంతోపాటు బ్యాంకు లీగల్ అడ్వైజర్ అడిగిన అన్ని డాక్యుమెంట్లు తెచ్చేందుకు మరో రూ.20 వేలు అయ్యింది. లేఅవుట్ అప్రూవల్స్ లేని సైట్‌ను కొని ఎంత పొరబాటు చేశానోనని కుమార్ ఇప్పుడు ఆవేదన చెందుతున్నాడు. ఇలాంటి బాధితులు పట్టణంలో చాలామంది ఉన్నారు.

ఇప్పటిదాకా జరిగిందిలా..

పలమనేరు నియోజకవర్గంలో ప్రస్తుతం 20 లేఅవుట్లలో స్థలాలు అమ్మకాలు సాగుతున్నాయి. వీటిలో అప్రూవల్ అయినవి కేవలం 4 మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. ఇక గ్రామాల్లో అయితే వ్యవసాయభూములనే లేఅవుట్లు వేసి సైట్లను విక్రయించేస్తున్నారు. రిజిస్ట్రేషన్‌పై నిషేధం ఉన్న భూములను సైతం యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి మామూళ్లు చెల్లించి రిజిస్ట్రేషన్ సైతం చేయించేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం కళ్లు తెరిచి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని పలమనేరు నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఇవీ..

లేఅవుట్ వేయాలంటే వ్యవసాయభూమిని (గ్రీన్‌బెల్ట్) వ్యవసాయేతరభూమి (ఎల్లోబెల్ట్)గా మార్చుకోవాలి. ఆపై గ్రామాల్లో అయితే పంచాయతీ, రెవెన్యూశాఖల నుంచి డిస్ట్రిక్ టౌన్‌కంట్రీ ఆఫీసర్ ద్వారా అనుమతి తీసుకోవాలి., పట్టణాల్లో అయితే మున్సిపాలిటీ ద్వారా డైరెక్టర్ ఆఫ్ టౌన్‌కంట్రీ కంట్రీప్లానింగ్(గుంటూరు) నుంచి అప్రూవల్స్ పొందాలి. అధీకృత ప్లాన్ ఇంజినీర్‌తో లేఅవుట్ స్కెచ్ వేయించాలి. ఆపై నిర్ధేశించిన లేఅవుట్‌లో విస్తీర్ణంలో 12.5 శాతం (రిజర్వు ఏరియా, కమ్యూనిటీ కోసం) గ్రామాల్లో పంచాయతీలకు, పట్టణాల్లో మున్సిపాలిటీలకు సంబంధిత అధికారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించాలి. లేదా ఆస్థలం మార్కెట్‌విలువలో 10 నుంచి 12శాతం నగదు చెల్లించాలి. లేఅవుట్‌లో ప్రధాన వీధులు 35 నుంచి 40 అడుగులు వాటికి అప్రోచ్ రోడ్లు కచ్చితంగా ఉండాలి. లేఅవుట్‌లో నీటి సౌకర్యం, డ్రైన్లు, కరెంటు వంటి మౌలిక సదుపాయాలుండాలి. ఆపై గ్రీనరీలాంటివి కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు అందిస్తున్న పవన్ కల్యాణ్

వి.కోట: పట్టణంలోని భారత్‌నగర్‌లో ఉన్న వృద్ధాశ్రమంలోని మహిళలకు స్థానిక ఎండీహెచ్ సంస్థ అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం చీరలు, అల్పాహారం పంపిణీ చేశారు. అలాగే సాయిగార్డెన్‌లోని ప్రత్యేక ప్రతిభావంతుల ఆదర్శపాఠశాలలోని సిబ్బందికి చీరలు, విద్యార్థులకు అల్పాహారం అందించారు.

వైభవంగా జాతర ప్రారంభం



విశేష అలంకరణలో రాళ్లగంగమాంబ

శాంతిపురం: మండలంలోని ఆరిముత్తనపల్లె, శాంతిపురం గ్రామాల ప్రజలు సమష్టిగా ఏటా మూడు రోజుల పాటు జరుపుకునే రాళ్లగంగమాంబ, సల్లాపురెమ్మ జాతర శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. తొలి రోజు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. దేవతా మూర్తులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. స్థానిక సబ్ స్టేషన్ వద్ద ఉన్న రాళ్లగంగమాంబ ఆలయంలో కల్యాణోత్సవం జరిపించి భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం పచ్చి గెరిగ, అగ్ని గుండం, బాణ వేడుకలు, ఆదివారం అమ్మవార్లకు పొంగళ్ల సమర్పణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు ‘అటానమస్’



అటానమస్ గుర్తింపు కార్డు చూపుతున్న బీసీ నాగరాజు

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా వచ్చినట్లు కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు తెలిపారు. 2024–34 మధ్య పదేళ్లకు యూజీసీ అటానమస్ హోదా మంజూరు చేసిందని వెల్లడించారు. అత్యున్నత ప్రమాణాలు పాటించినందునే కళాశాలకు ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. సామాజిక, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇక్కడి విద్యార్థులు ప్రపంచ గుర్తింపు పొందిన కంపెనీల్లోపెద్ద ప్యాకేజీలకు ఉద్యోగులుగా ఎంపికవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ బాస్కరన్, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్‌ను ఆయన అభినందించారు.

కొవ్వొత్తులతో నిరసన



నిరసన తెలుపుతున్న వాల్మీకి సంఘం నేతలు

చౌడేపల్లె: నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రిలో ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు బస్టాండ్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. బాలిక ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

రామకృష్ణ సేవలు చిరస్మరణీయం



ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న దర్శి, ఎంఈఓ కేశవరెడ్డి

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేసి గత ఏడాది గుండెపోటుకు గురై మృతిచెందిన టీచర్ రామకృష్ణ సేవలు చిరస్మరణీయమని ఎంఈఓ కేశవరెడ్డి కొనియాడారు. శుక్రవారం చౌడేపల్లె ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పదోతరగతి పరీక్షల్లో ఆంగ్లం సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన లతశ్రీకి రామకృష్ణ కుటుంబసభ్యుల చేతులమీదుగా రూ.5116 బహుమతి అందజేశారు. హైస్కూల్ ప్లస్‌లో మొదటి స్థానం సాధించిన బి. రజని రూ.1116, అమృతకు రూ.516 ల నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజారెడ్డి, ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌రెడ్డి, మురళి, శంకర్ పాల్గొన్నారు.

అక్కదేవతలకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అక్కదేవతలు

పుంగనూరు: మండలంలోని అమ్మిగానిపల్లెలో శుక్రవారం అక్కదేవతలకు విశేష పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఏటా అక్కదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా గ్రామస్తులు సమష్టిగా అక్కదేవతలకు పచ్చవేశారు. వివిధ పుష్పాలు, గాజులు, పసుపు, కుంకుమ , నిమ్మకాయలు పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారికి శాఖాహార వంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నసమారాధన చేశారు. పూజ జరుగుతుండగానే వర్షం కురవడంతో గ్రామస్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

16న నగరిలో జాబ్‌మేళా

నగరి: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎంఆర్ఎఫ్ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ మంగళవారం ఎంఆర్ఎఫ్ ట్రైనీ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బి.సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. పూర్తి వివరాలకు ఎంఆర్ఎఫ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ఎస్ఎస్ కన్నన్‌ను 99529 70545కు జేకేసీ ఫుల్‌టైం మెంటర్ ఆర్.లాల్ బాషాను 95731 04593 సంప్రదించాలన్నారు.

‘ఆదర్శ’వంతంగా బోధన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ పురుషోత్తం

పుంగనూరు: ఆదర్శ పాఠశాలలో బోధన, తద్వారా ఫలితాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శవంతంగా ఉండాలని డీవైఈఓ పురుషోత్తం సూచించారు. శుక్రవారం పుంగనూరులోని మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీవైఈఓ మాట్లాడుతూ విద్యార్థులు దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపల్ రమను ఆదేశించారు.

ధర్మరాజస్వామి ఉత్సవాలకు శ్రీకారం

కార్వేటినగరం: మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛారణ నడుమ ధ్వజారోహణం జరిపించారు. ధ్వజపటాన్ని ఎగురవేశారు. మ. ధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భాగవతారిణి రెడ్డెమ్మ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. రాత్రి ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కొలువుదీర్చి గ్రామోత్సవం చేశారు. ఇంటింటా భక్తులు కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలకు యాదవ కులస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉపకోశాధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పశుగ్రాసం సమపాళ్లలో అందించి, పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయకుడు సురేష్ తెలిపారు. శుక్రవారం తాళంబేడు గ్రామంలో పశుగ్రాస వారోత్సవం నిర్వహించారు. పశుగ్రాసం పెంపకంపై అవగాహన కల్పించారు. రైతు పొలాల్లో పశుగ్రాసం పెంపకం చేపట్టి, వాటిని పాడి పశువులకు అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించడం తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాధమ్మ

పలమనేరు: ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పెషల్ జడ్జి రాధమ్మ స్పష్టం చేశారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించని కారణంగా చాలామంది ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. కుటుంబంలో ఒక్కరిని పోగొట్టుకుంటే వారి వేదన వర్ణనాతీతమన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు.

కరుణించని వరుణుడు



నీరు లేక నిరుపయోగంగా మారిన బోరు



బీడుగా మారిన భూమి

కుప్పం నియోజకవర్గం గుడుపల్లె మండలంపై వరుణుడి కరుణ దూరమైంది. ఇటీవలి వరకు అడపాదడపా కురుస్తున్న వర్షం సైతం నెల రోజులుగా శీత కన్ను వేసింది. పలు ప్రాంతాల్లో భూగర్భజలం అడుగంటి పోయింది. దీంతో పుష్కలంగా నీరు అందిస్తున్న బోరు బావులు నియోపయోగంగా మారిపోయాయి. సేద్యం పనులు నిలిచిపోయాయి. వందలాది ఎకరాలు బీడు బారుతున్నాయి. అక్కడక్కడా వర్షాధారంగా వేసిన పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. చివరకు రైతుల ఆశలు కొడిగట్టిపోతున్నాయి.

- అడుగంటిన భూగర్భజలాలు
- నిరుపయోగంగా మారిన బోరుబావులు
- బీడు బారుతున్న భూములు
- ఆందోళనలో రైతులు

గుడుపల్లె: మండలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సేద్యం పనులు ముందుకు సాగలేని దుస్థితి దాపురించింది. నెల రోజుల క్రితం కురిసిన అరకొర వర్షానికి అక్కడక్కడా కొందరు రైతులు భూములను దుక్కి దున్నుకుని వేరుశనగ వేశారు. తర్వాత వర్షం పడక పోవడంతో భూమిలో తేమ శాతం పూర్తిగా తగ్గిపోయింది. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. అధిక శాతం వ్యవసాయ బోరు బావుల నుంచి చుక్కనీరు రాక నిరుపయోగంగా మారాయి. మండలంలో మొత్తం 1,600 బోరుబావులు ఉండగా 60 శాతం ఇప్పటికే ఎండిపోయాయి. మిగిలి వాటిలో అరకొరగా మాత్రమే నీరు వస్తోంది. దీంతో సాగు, తాగు నీటి కోసం మండల వాసులు నానా అవస్థలు పడుతున్నారు. సాగు నీటి కొరతతో బోరు బావుల కింద పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో వందల ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి. పంటల సంగతి దేముడెరుగు..పశువుల మేత కోసం అరకొరగా సాగు చేసుకున్న గ్రాసానికి కూడా నీరందని పరిస్థితి ఏర్పడింది. మేత లేక జీవానాధారమైన పాడి పశువులను సైతం రైతులు మనసు చంపుకుని కబేళాలకు విక్రయించుకునే దుస్థితి వచ్చి పడింది.

తప్పని అప్పులు తిప్పలు

బోరు బావులు ఎండిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు పలువురు రైతులు మరిన్ని కష్టాలను కొని తెచ్చుకున్నారు. వేరే చోట్ల ఒక్కొక్కరు మూడు నుంచి నాలుగు బోర్లు వేయించుని, వాటిలోనూ నీరు పడక అప్పుల పాలయ్యారు. చేసిన అప్పులకు వడ్డీలు తడిసి మోపెడవుతాయని బెంగ పెట్టుకుంటున్నారు. సాధారణంగా ఆరుద్ర కార్తెలోనే వేరుశనగ సాగు చేపడుతుంటారు. అయితే ఈ ఏడాది ఇప్పటికీ చాలా మంది రైతులు సేద్యం పనులు కూడా మొదలుపెట్టలేదంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. రోజూ మేఘాలు ఉరిమినప్పుడల్లా అన్నదాతలు ఆశగా ఆకాశం వైపు చూస్తున్నారు. వరుణుడు కరుణించకపోతాడా అని ఎదురుచూస్తున్నారు.

ప్రగతి పథం.. కాణిపాకం



కాణిపాక ఆలయం, (ఇన్‌సెట్) ఈఓ వెంకటేశు

కాణిపాకం: కాణిపాకం ఆలయం ప్రగతి పథంలో పయనిస్తోంది. ఆది దేవుడి సన్నిధిలో సకల వసతులు సమకూరుతున్నాయి. ఆలయ అధికార యంత్రాంగం అమలు చేస్తున్న మాస్టర్ ప్లాన్ మార్పులు తీసుకొస్తోంది. అభివృద్ధికి దేవస్థానం తొలి ప్రాధాన్యత ఇస్తోంది. తద్వారా కాణిపాకం కొత్తపుంతలు తొక్కుతోందని ఈవో వెంకటేశు సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: కాణిపాకం అభివృద్ధి ఎలా సాగుతోంది?

జవాబు: గత మూడేళ్లుగా దేవస్థానంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. ప్రధానంగా ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశాం. వెండి, బంగారు పూతతో ముఖద్వారానికి సరికొత్త శోభను తీసుకొచ్చాం. భక్తులకు సౌకర్యార్థంగా సదన్‌లో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నాం. పలు రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఆ రోడ్లలో ఆర్చి నిర్మాణ పనులు పూర్తవుతోంది. సుమారు రూ.150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందుకు దాతలు, ఉభయదారులు, భక్తుల సహకారం ఉంది.

ప్రశ్న: మాస్టర్‌ప్లాన్ అమలు ఎంత వరకు వచ్చింది?

జవాబు: 2019లో మాస్టర్ ప్లాన్ తీసుకొచ్చారు. దాని ప్రకారం ఇప్పటి వరకు పలు పనులను పూర్తి చేశాం. మళ్లీ ఏడాదికి ముందు ఈ ప్లాన్‌పై సమీక్ష చేశాం. ఇందులో నూతనంగా క్యూ కాంప్లెక్స్ నిర్మించాలని, ఆర్టీసీ బస్టాండు, మహా ప్రాకారం నిర్మించాలని ప్లాన్‌లో ఉంది. నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం బహుదానదిపై రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని నివేదికల్లో ఉంది. జాతీయ రహదారి నుంచి నేరుగా ఆలయానికి చేరుకోవడానికి రోడ్డు నిర్మాణం చేపట్టే పనుల్లో ఉన్నాం.

ప్రశ్న: భక్తుల వసతుల కల్పనకు తీసుకున్న చర్యలు

జవాబు: భక్తులకు వసతుల కల్పనలో భాగంగా వినాయక సదన్‌లో గదుల సంఖ్యను పెంచుతున్నాం. 100 గదులు ఉంటే వాటిని 200కు పెంచుతున్నాం. త్వరలో ఆ పనులు కూడా పూర్తి కావస్తోంది. ఇక కొత్తగా డార్మిటరీ నిర్మించనున్నాం. ముఖ్యంగా తిరుమలకు వచ్చే భక్తులు ఇక్కడ స్వామి వారిని దర్శించుకుని వెళ్లిపోతున్నారు. అలా కాకుండా భక్తులు కనువిందు చేసేలా, వారి మెచ్చేలా కాణిపాకాన్ని తీర్చిదిద్దాలనే ప్రయత్నంలో ఉన్నాం. ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా చూస్తాం. ఇవన్నీ కూడా మాస్టర్ ప్లాన్‌లో పొందుపరుస్తున్నాం.

ప్రశ్న: సాధించిన ప్రగతి ఏంటి?

జవాబు: దేవస్థానానికి కొత్త రూపం తీసుకోరావడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా వరసిద్ధుని దర్శించుకోవాలన్నదే లక్ష్యం. ఎన్నో ఏళ్లుగా సమస్యల్లో ఉన్న వంద అడుగుల రోడ్డును పూర్తి చేశాం. బంగారు రథాన్ని తయారు చేయించాం. లడ్డూపోటు, బంగారు, వెండి వాకిలి తయారు చేయించాం. భవిష్యత్‌లో ఆలయానికి ఎలాంటి డోకా లేకుండా.. మరో 50 ఏళ్లు దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నదే లక్ష్యంతో ముందుకెళుతున్నాం. అందుకు ఆది దేవుని కృప, కరుణ, కటాక్షం ఉంటే కచ్చితంగా నెరవేర్చేలా చూస్తాం.